సాక్షి సిద్దిపేట

గురువారం । 28 । నవంబర్ । 2024



విద్యార్థులకు 'పరీక్ష'

టెన్త్ పరీక్ష ఫీజు చెల్లింపు విషయంలో పాత నిబంధనలే అమలవుతున్నాయి.

వివరాలు 8లో ▸



బీటీ రోడ్డు నాణ్యత డొల్ల

తారు రోడ్డుకు నాణ్యత కొరవడింది. వారం రోజుల్లోనే రోడ్డు అధ్వానంగా మారింది.

వివరాలు 9లో ▸



ఎన్నాళ్లో వేచిన సమయం

హుస్నాబాద్ కుగ్రామం నుంచి కాలానుగుణంగా మున్సిపాలిటీగా రూపాంతరం చెందింది.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

రేపటి నుంచి సిటీ పోలీస్‌యాక్టు

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలో ఈ నెల 29 నుంచి డిసెంబర్ 14వ తేదీ వరకు సిటీ పోలీస్‌యాక్టు అమలులో ఉంటుందని సీపీ అనురాధ తెలిపారు. పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, సభలు, సమావేశాలు, రాస్తారోకోలు నిర్వహించరాదన్నారు. అదే విధంగా సౌండ్ వినియోగంపై ఉన్న నిషేధాజ్ఞలు కూడా పొడిగిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

సన్న ధాన్యాన్ని దళారులకు అమ్ముకోవద్దు

డీఆర్‌డీఏ పీడీ జయదేవ్ ఆర్య



కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీఓ జయదేవ్ ఆర్య

జగదేవ్‌పూర్(గజ్వేల్): దళారులకు సన్నరకం ధాన్యం అమ్ముకుని మోసపోవద్దని, ప్రభుత్వం సన్నరకానికి బోనస్ ఇస్తోందని డీఆర్డీఏ పీడీ జయదేవ్‌ఆర్య అన్నారు. బుధవారం మండలంలోని మునిగడపలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఒకవేళ కొనుగోలు కేంద్రం రైతులకు దూరమైతే స్థానికంగా ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. అలాగే కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. ప్రతి రైతు తమ ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే విక్రయించి బోనస్ పొందాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యాదగిరి, డీపీఎం వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు

డీఐఈఓ రవీందర్ రెడ్డి



చైతన్యశ్రీని సన్మానిస్తున్న డీఐఈఓ, అధ్యాపక బృందం

చిన్నకోడూరు(సిద్దిపేట): చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని.. విద్యార్థులు పట్టుదలతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని డీఐఈఓ రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం చిన్నకోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. విద్యార్థులు, అధ్యాపకులతో సమావేశమయ్యారు. వచ్చే వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. కళాశాలలో అడ్మిషన్ల సంఖ్య పెంచాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం ఇటీవల ఫుట్‌బాల్ క్రీడల్లో జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థిని చైతన్యశ్రీని సన్మానించి, జాతీయ స్థాయిలో కళాశాలకు పేరు తేవాలని సూచించారు.

హెచ్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడిగా కరీమొద్దీన్



గజ్వేల్: గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం జిల్లా నూతన కమిటీ అధ్యక్షుడిగా గజ్వేల్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కరీమొద్దీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం సిద్దిపేటలోని ఇందిరానగర్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా చింతమడక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాజిరెడ్డి, కోశాధికారిగా అంతక్కపేట హెచ్‌ఎం చంద్రశేఖర్‌లు సైతం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమానికి మెదక్ జిల్లా శాఖ గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం అధ్యక్షుడు సత్యం ఎన్నికల అధికారిగా వ్యవహరించగా రాష్ట్ర అధ్యక్షుడు రాజభాను చంద్రప్రకాశ్, ప్రధాన కార్యదర్శి రాజగంగారెడ్డిలు ముఖ్యఅతిథిలుగా హాజరయ్యారు.

కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా పాండు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా మంద పాండు నియమితులయ్యారు. బుధవారం డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి నియామకపత్రాన్ని గజ్వేల్‌లో అందించారు. తన నియామకానికి కృషి చేసిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, నర్సారెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.



ఆడిట్ ఫైళ్లు మాయం

ముగ్గురు ఉద్యోగులకు మెమోలు జారీ ● కొమురవెల్లి మల్లన్న ఆలయంలో వెలుగులోకి..

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లన్న ఆలయంలో వివిధ విభాగాలకు సంబంధించిన ఆడిట్ ఫైళ్లు మాయమయ్యాయి. ఈ క్రమంలో గతంలో ఇక్కడ పని చేసిన ముగ్గురు ఉద్యోగులకు మెమోలు జారీ చేశారు. వివరాలిలా ఉన్నాయి. 2014 ఏప్రిల్ నుంచి మార్చి 2017 వరకు చేపట్టిన ఆలయ ఆదాయ వ్యయాలపై గతంలో ఆడిట్ నిర్వహించారు. సుమారు రూ.3కోట్ల మేర లావాదేవిలపై ఆడిట్ అభ్యంతరాలు ఉన్నట్లు వ్యక్తం చేశారు. దీంతో 2018లో అప్పటి దేవాదాయ శాఖ కమిషనర్ 2014 ఏప్రిల్ నుంచి మార్చి 2017 వరకు పని చేసిన ఆలయ ఈఓలు, పలువురు ఉద్యోగులకు సంజాయిషీ ఇవ్వాలని నోటీసులు జారీ చేయడంతో కొంత మేరకు మెజర్మెంట్ బుక్‌లు, బిల్లులు సమర్పించారు. ఇంకా రూ.కోటికిపైగా ఆడిట్ అభ్యంతరాలకు ఎలాంటివి చూపలేదు. అయితే ఇటీవల అధికారులు రికార్డుల పరిశీలనలో ఫైళ్లు మాయమైన విషయం గుర్తించారు. గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులు నీల శేఖర్, జగన్, నర్సింహులుకు నోటీసులు జారీ చేశారు. ఆడిట్‌కు సంబంధించిన ఫైళ్లు దేవాలయంలో అందుబాటులో లేవని వెంటనే అందించాలని, లేనట్లయితే శాఖాపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించినట్లు ఆలయ ఈవో బాలాజీ తెలిపారు.

రోడ్ల విస్తరణకు నిధులివ్వండి

కేంద్ర మంత్రి గడ్కరిని కోరిన మంత్రి పొన్నం



కేంద్ర మంత్రి గడ్కరితో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: నియోజకవర్గంలోని పలు రోడ్ల విస్తరణకు, హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలో గడ్కరిని కలిసి విన్నవించారు. కోహెడ నుంచి దేవక్కపల్లికి, నాగ సముద్రాల, అక్కన్నపేట వయా రామవరం నుంచి జనగామ వరకు రోడ్లను విస్తరించేందుకు నిధులు మంజూరు చేయాలని మంత్రి కోరారు. అలాగే గుగ్గిళ్ల నుంచి తంగలపల్లి, తంగలపల్లి వయా గుండారెడ్డి పల్లి నుంచి బద్దిపడిగ వరకు రహదారుల విస్తరణకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. గుంటూరు పల్లి నుంచి కేశవపూర్ వరకు, కోతులనడుమ, ముల్కనూర్ వయా గోపాల్‌పూర్ వరకు, కోతుల నడుమ నుంచి జగన్నాథపురం వయా జిలుగుల, పెంచికల్ వరకు రోడ్ల విస్తరణ చేపడతామని తెలిపారు. వంగర హుజురాబాద్ నుంచి కన్నారం వరకు, బొమ్మనపల్లి నుంచి డబుల్ లేన్ పొలంపల్లి వరకు చేపట్టనున్నామన్నారు. హుజురాబాద్ నుంచి సుందరగిరి వరకు రోడ్డు విస్తరణ, అలాగే హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపడతున్నట్లు తెలిపారు. మొలంగూర్, సైదాపూర్ మధ్య హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం, కొత్తగట్టు, దుద్దెనపల్లి మధ్య హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం, మానకొండూరు, హుస్నాబాద్ మధ్య హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి గడ్కరిని కోరినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

విజ్ఞాన జాతర

- నేటి నుంచి ఇన్‌స్పెయిర్, సైన్స్ ఎగ్జిబిషన్
- మూడు రోజుల పాటు కొనసాగనున్న ప్రదర్శనలు



సైన్స్ ఎగ్జిబిట్లను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు (ఫైల్)

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలో ఇక విజ్ఞాన జాతర సాగనుంది. గురువారం నుంచి ఇన్‌స్పెయిర్, సైన్స్ ఎగ్జిబిషన్లకు జిల్లా కేంద్రం వేదిక కానుంది. శాస్త్ర సాంకేతిక రంగాలు, ప్రయోగాలు, పరిశీలనల వైపు విద్యార్థులను మళ్లిస్తే భవిష్యత్‌లో ఉత్తమ శాస్త్ర వేత్తలుగా ఎదిగే అవకాశం ఉంది. విజ్ఞానం, శాస్త్రీయ దృక్పథం వైపు మళ్లించే విధంగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతి యేటా నిర్వహిస్తున్న ఇన్‌స్పెయిర్ మనక్‌తో పాటు సైన్స్ ఎగ్జిబిషన్‌ల ప్రదర్శన కొనసాగనుంది. కలెక్టర్, జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన చైర్మన్ మనుచౌదరి, విద్యాశాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు.

ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో..

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గురు, శుక్ర, శనివారాలలో ఈ ప్రదర్శనలు నిర్వహించనున్నారు. గురువారం ఉదయం 12 గంటలకు ఈ విజ్ఞాన జాతర ప్రారంభం కానుంది. రాష్ట్రంలోనే అత్యధికంగా 188 ఇన్‌స్పెయిర్, ప్రాజెక్టులు, అలాగే 250 సైన్స్ ఎగ్జిబిట్‌లను ప్రదర్శించనున్నారు. గత సంవత్సరం వివిధ కారణాలతో ఇన్‌స్పెయిర్, సైన్స్ ఎగ్జిబిషన్లు ఆన్‌లైన్‌లోనే నిర్వహించారు.

13 కమిటీలతో నిర్వహణ..

ఇన్‌స్పెయిర్, సైన్స్ ఎగ్జిబిట్ల ప్రదర్శనకు గాను 13 కమిటీలను నియమించారు. ప్రతి కమిటీలో మండల విద్యాధికారి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు. వీరు ఈ ప్రదర్శనల నిర్వహణ బాధ్యతను సమన్వయంతో పూర్తి చేయనున్నారు. ఈ 13 కమిటీలను జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా సైన్స్ అధికారులు పర్యవేక్షించనున్నారు. కార్యక్రమంలో పాల్గొనే ఉపాధ్యాయులు, విద్యార్థులకుగాను మూడు రోజుల పాటుగా కలెక్టర్ సహాయంతో భోజన సౌకర్యం కల్పించనున్నారు.

ఇన్‌స్పెయిర్ మనక్ అంటే..

ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు పాఠశాల విద్యార్థులను శాస్త్ర సాంకేతిక రంగాల వైపు మళ్లించడమే ఈ ఇన్‌స్పెయిర్ మనక్ ముఖ్య ఉద్దేశ్యం. కేంద్ర ప్రభుత్వం అందుకోసం ఒక్కో ప్రదర్శనకు గాను రూ.10వేలు విద్యార్థి బ్యాంకు ఖాతాలో నేరుగా జమ చేసింది. విద్యార్థుల్లో జిజ్ఞాస, సృజనాత్మకతను వెలికి తీయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యంగా ప్రవేశపెట్టారు. ఈ ఇన్‌స్పెయిర్‌లో ప్రదర్శించే ప్రదర్శనలను ముందుగానే సంబంధిత వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలను పొందుపర్చాల్సి ఉంటుంది. అనంతరం వాటిని పరిశీలించిన శాస్త్రవేత్తలు అందులో ఉత్తమమైన ప్రదర్శనలు ఎంపిక చేసి వారి ప్రదర్శనలు ప్రదర్శించేందుకు అనుమతినిస్తారు. దీంతో ఈ సంవత్సరం జిల్లా నుంచి 188 ప్రదర్శనలు ఎంపికయ్యాయి. ఇందులో 18 ఉత్తమ ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికకానున్నాయి. అదేవిధంగా 250 సైన్స్ ఎగ్జిబిట్లను 7 ఉపవిభాగాలుగా విభజించి, అందులో నుంచి జూనియర్, సీనియర్ విభాగాల్లో 2 చొప్పున 14 ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నారు. అలాగే ప్రశంస పత్రాలను అందించనున్నారు.

ఆర్చ్‌ఫార్మా కార్మికులను ఆదుకోండి

కలెక్టర్ మనుచౌదరికి వినతి



కలెక్టర్ మనుచౌదరికి వినతిపత్రం అందిస్తున్న ఆర్చ్‌ఫార్మాల్యాబ్ ఉద్యోగులు, నాయకులు

సిద్దిపేటరూరల్: మిట్టపల్లిలోని ఆర్చ్ ఫార్మా ల్యాబ్ లిమిటెడ్ కంపెనీలో పనిచేసే ఉద్యోగులను, కార్మికులను ఆదుకోవాలంటూ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం బీఎంఎస్, ఆర్చ్‌ఫార్మ కంపెనీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ మనుచౌదరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంపెనీ మనుగడ ప్రశ్నార్థకంగా మారిన నేపథ్యంలో అందులో పనిచేసే కార్మికుల భవిష్యత్ అంధకారంగా మారిందన్నారు. కంపెనీపై ఆధారపడి సుమారు 400 కుటుంబాలు 25 ఏళ్లుగా జీవనం సాగిస్తున్నాయన్నారు. 3 నెలలుగా వేతనాలు సరైన సమయానికి ఇవ్వకపోవడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. తక్షణం ప్రభుత్వం చర్యలు చేపట్టి కార్మికులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో కలాల్‌శ్రీను, అర్చ్‌ఫార్మ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలపై ప్రత్యేక నిఘా

సిద్దిపేట పట్టణంలో నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు



సిద్దిపేటలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది

సిద్దిపేటకమాన్: మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు సిద్దిపేట వన్ టౌన్ సీఐ వాసుదేవరావు తెలిపారు. బుధవారం నార్కోటిక్స్ డాగ్స్‌తో పట్టణంలో అనుమానాస్పద ప్రాంతాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ వాసుదేవరావు మాట్లాడుతూ.. పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో, పాన్ షాప్‌లు, ఇతర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. మత్తు పదార్థాలు కలిపిన చాక్లెట్లు ఎవరైనా కలిగి ఉన్నా, విక్రయించినా, రవాణా చేసిన వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు ఎవరైనా కలిగి ఉన్నా, విక్రయించినా డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు తెలపాలని సీఐ సూచించారు. కార్యక్రమంలో వన్ టౌన్ ఎస్‌ఐలు కనకయ్యగౌడ్, కొమురయ్య, పోలీసు సిబ్బంది రామ్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో తీరని నష్టం



అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి స్వాతిరెడ్డి



హుస్నాబాద్: మాట్లాడుతున్న జడ్జి కృష్ణతేజ్

- నిర్మూలన అందరి బాధ్యత
- జిల్లా న్యాయమూర్తి స్వాతిరెడ్డి

సిద్దిపేటకమాన్: బాల్య వివాహాల వల్ల భవిష్యత్తుకు తీరని నష్టం జరుగుతుందని నిర్మూలన అందరి బాధ్యత అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, న్యాయమూర్తి స్వాతిరెడ్డి అన్నారు. సిద్దిపేట కోర్టు భవనంలో బాల వివాహ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఎన్‌జీవోస్, సఖీ, భరోసా, షీ టీమ్ సిబ్బంది, ఇతర మహిళలతో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. బాల్య వివాహాలు జరుగుతున్నాయని తెలిస్తే 1098 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి తెలపాలన్నారు. విద్యార్థినుల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే వెంటనే తమ తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. ఎన్‌జీవోస్ సంస్థ వారి చేత బాల్య వివాహాలు జరగకుండా చూడాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో భరోసా, సఖీ, షీటీమ్ సిబ్బంది, న్యాయసేవ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అందరి కృషి అవసరం

హుస్నాబాద్: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అదనపు సివిల్ కోర్టు జడ్జి కృష్ణతేజ్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ గిరిజన బాలికల రెసిడెన్సియల్ పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ చదువుతోనే సమాజంలో గుర్తింపు వస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు అధికంగా జరుగుతున్నాయని, వీటిని నిర్మూలించడానికి ప్రభుత్వాలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు. బాల్య వివాహాల వల్ల అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పట్టు'లో యాజమాన్య పద్ధతులు తప్పనిసరి



మాట్లాడుతున్న ఇంద్రసేనారెడ్డి

చిన్నకోడూర్(సిద్దిపేట): పట్టు సాగు చేసే రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని పట్టుపరిశ్రమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఇంద్రసేనారెడ్డి అన్నారు. ములుగు పట్టు పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం చంద్లాపూర్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. శాస్త్రవేత్త వినోద్‌కుమార్ మల్బరీ సాగు, పురుగుల సంరక్షణ, షెడ్డు పరిశుభ్రత, తెగుళ్లకు పిచికారీ చేయాల్సిన రసాయనాలను వివరించారు. కార్యక్రమంలో పట్టు పరిశ్రమ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఏబీసీ యూనిట్ పరిశీలన



యానిమల్ బర్త్ కంట్రోల్ యూనిట్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

సిద్దిపేటజోన్: మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) యూనిట్‌ను బుధవారం అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఇప్పటివరకు ఎన్ని కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశారని ఆరా తీశారు. కుక్కలను సంరక్షించే గదులను పరిశీలించారు. అనంతరం అక్కడి సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రాన్ని పర్యవేక్షించారు. తయారీ చేసిన సేంద్రియ ఎరువులు ఎవరెవరికి విక్రయిస్తున్నారని ఆరా తీశారు. రైతులను చైతన్యం చేసి, సేంద్రియ ఎరువులు వాడేలా చూడాలని సూచించారు. ఆయన వెంట అర్బన్ తహసీల్దార్ సలీమ్ మియ్యా, మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ శ్రీకాంత్, సానిటరీ ఇన్స్పెక్టర్ వనిత తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుతో అధిక ఆదాయం



బెజుగామలో ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అనిల్‌కుమార్

ఆయిల్‌ఫెడ్ సంస్థ జిల్లా ఇన్‌చార్జి అనిల్‌కుమార్

గజ్వేల్: ఆయిల్‌పాం సాగుతో అధిక ఆదాయం లభిస్తుందని ఆయిల్‌ఫెడ్ సంస్థ జిల్లా ఇన్‌చార్జి అనిల్‌కుమార్ అన్నారు. బుధవారం గజ్వేల్ మండలం బెజుగామ గ్రామంలో ఆయిల్‌పాం సాగు, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, సాగులో మెలకువలపై రైతులకు అవగాహన కల్పించారు. మొదటి మూడు సంవత్సరాల వరకు ఆయిల్‌పాంలో అంతర పంటల సాగుతో ఆదాయం సమకూరుతుందని, నాలుగో ఏటా పంట చేతికివచ్చి ఆదాయం మొదలవుతుందని చెప్పారు. చీడపీడల బెడద కూడా తక్కువేనని చెప్పారు. ఆసక్తి గల రైతులు స్థానిక ఏఈఓలను సంప్రదించి తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఇంకా ఈ కార్యక్రమంలో గజ్వేల్ వ్యవసాయాధికారి నాగరాజు, ఉద్యానవనశాఖాధికారిణి సౌమ్య, ఏఈఓ మాధవీ తదితరులు పాల్గొన్నారు.

కొత్త మండలాలకు పూర్తిస్థాయి హోదా

అక్బర్‌పేట-భూంపల్లి, కుకునూరుపల్లి, దూళ్మిట్ట..

- తాజాగా జీఓ విడుదల చేసిన ప్రభుత్వం
- మండల ప్రజాపరిషత్‌లు ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు



అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రం

దుబ్బాక: జిల్లాలో కొత్తగా ఏర్పడిన అక్బర్‌పేట-భూంపల్లి, కుకునూరుపల్లి, దూళ్మిట్ట మండలాలు ఇక నుంచి పూర్తిస్థాయి హోదా పొందాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2022 సెప్టెంబర్ 22న కొత్తగా మూడు రెవెన్యూ మండలాలు ఏర్పాటు చేసిన విషయం విదితమే. దీంతో ఈ మండలాల్లో కొత్తగా తహసీల్దార్ కార్యాలయాలు ఏర్పాటు చేసినప్పటికీ పాలకులు (ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీలు), ఎంపీడీఓ కార్యాలయాలు ఇప్పటి వరకు పాత మండలాల పరిధిలోనే కొనసాగుతున్నాయి. తాజాగా ప్రభుత్వం పూర్తిస్థాయి మండలాలుగా ప్రకటిస్తూ జీఓ 67 విడుదల చేసింది. అక్బర్‌పేట-భూంపల్లిలో 19 గ్రామపంచాయతీలు, కుకునూరుపల్లిలో 15 గ్రామాలు, దూళ్మిట్టలో 11 గ్రామపంచాయతీలతో కొత్త మండలాలు ఏర్పాటయ్యాయి.

స్థానిక ఎన్నికల్లో కొత్త మండలాల్లోనే..

త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ప్రభుత్వం విడుదల చేసిన జీఓతో కొత్త మండలాల్లోనే జరగనున్నాయి. ఎంపీటీసీలు, సర్పంచ్, ఎంపీపీ, జెడ్పీటీసీలు త్వరలో జరగబోయే ఎన్నికల్లో ఈ కొత్త మండలాల పేరిటనే జరుగుతాయి. ప్రభుత్వం పూర్తిస్థాయి మండలాలుగా మండల పరిషత్‌లు ఏర్పాటు చేస్తూ జీఓ విడుదల చేయడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

క్షీరాభిషేకాలు..

అక్బర్‌పేట-భూంపల్లికి పూర్తిస్థాయి మండలం హోదా కల్పించడంపై బుధవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంటకస్వామిగౌడ్, బాల్తె వెంకటేశం లు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

సీఎంకు కృతజ్ఞతలు



అక్బర్‌పేట-భూంపల్లి కొత్త మండలానికి పూర్తిస్థాయి మండలం హోదా కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం చాలా సంతోషం. మండల పరిషత్‌తో పాటు అన్ని కార్యాలయాలు ఏర్పాటు అయితే ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు.

– బాల్తె వెంకటేశం, భూంపల్లి

సౌకర్యాలు కల్పించాలి



అక్బర్‌పేట-భూంపల్లితో పాటు కుకునూరుపల్లి, దూళ్మిట్ట కొత్త మండలాలకు మండల ప్రజాపరిషత్ లు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీఓ విడుదల చేయడం సంతోషం. ప్రభుత్వ కార్యాలయాల్లో అన్ని సౌకర్యాలు అధికారులు, సిబ్బందిని ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ కార్యాలయాల కొత్త భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలి.

– కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే

క్లుప్తంగా

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన



వర్గల్ ఎమ్మార్సీ వద్ద తెలుపుతున్న యాదగిరి తదితరులు

వర్గల్(గజ్వేల్): సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలనే డిమాండ్‌తో బుధవారం వర్గల్ మండల వనరుల కేంద్రం వద్ద ఉద్యోగులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, తమ డిమాండ్లు ఆమోదించి తక్షణమే పేస్కేల్ వర్తింపజేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుండిగల్ యాదగిరి కోరారు. లేనిపక్షంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు డిసెంబర్ మొదటి వారంలో సమ్మెకు దిగుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.నవీన్ కుమార్, సంఘ ప్రతినిధులు కరుణాకర్, భూపాల్, బలరాం పాల్గొన్నారు.

పత్తికి క్వింటాలుకు రూ.10 వేలు ఇవ్వాలి



మారేపల్లిలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నర్సింలు

కొండాపూర్(సంగారెడ్డి): పత్తికి క్వింటాలుకు మద్దతు ధర రూ 10 వేలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నర్సింలు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలో పలు గ్రామాలలో సీపీఎం బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తిని ఎక్కువగా దళారులే కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. సీసీఐ క్వింటాలు పత్తికి రూ.7,400 ఇస్తామని ప్రభుత్వాలు గొప్పలు చెప్పడమే తప్పా ఎక్కడా కొనడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రాజయ్య మండల కమిటీ సభ్యులు బాబురావు, పుల్లయ్య, కిషన్, పెద్దాపురం రాజు, మాణయ్య, అనంతరావు, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ ఉపాధ్యక్షుడిగా లక్ష్మయ్య యాదవ్



నారాయణఖేడ్: తెలంగాణ ప్రోగ్రెస్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మర్పల్లి లక్ష్మయ్య యాదవ్ ఎన్నికయ్యారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన సంఘం జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఈయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నారాయణఖేడ్ మండలం అనంతసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న లక్ష్మయ్య యాదవ్ గతంలో సంఘం జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాగా లక్ష్మయ్య ఎన్నిక పట్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాబురావు, విఠల్, గోవింద్, కార్యదర్శులు మహేశ్వర్‌రావు, డివిజన్ నాయకులు వెంకట్‌రాథోడ్, కిషన్‌రావు, ఎండీ ఆదం, దీపక్ హర్షం వ్యక్తం చేశారు.

కొండచిలువ కలకలం



బేగంపేటలో కొండచిలువ

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని బేగంపేటలో గల ఆనందయ్య స్వామి మఠం వెనుక వైపున బుధవారం కొండ చిలువ కనపడటంతో కలకలం నెలకొంది. గతంలో బెజ్జంకి, గాగిళ్లాపూర్, లక్ష్మీపూర్, వడ్లూరు గ్రామాలలో కొండ చిలువలు కనిపించాయి. ఈరోజు బేగంపేటలో కొండచిలువ కనబడటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వీటి నివారణ కోసం అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యార్థులకు పరీక్ష

- పాత నిబంధనలతో పరేషాన్
- అందని పదో తరగతి ఫీజు మాఫీ..
- జిల్లాలో 3,403 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు

కేటగిరీల వారీగా విద్యార్థుల వివరాలు

కేటగిరీ	బాలురు	బాలికలు	మొత్తం
జనరల్	314	314	628
ఎస్సీ	842	1,019	1,861
ఎస్టీ	751	791	1,542
ఓబీసీ	3,365	3,368	6,733
మొత్తం	5,272	5,492	10,764



కొల్చారం మండలం రంగంపేట జెడ్పీ హైస్కూల్

మెదక్ కలెక్టరేట్: పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫీజు చెల్లింపు విషయంలో పాఠశాల విద్యాశాఖ పాత నిబంధనలే అమలు చేస్తోంది. దీంతో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అన్యాయం జరుగుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో 45 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, విద్యార్థులే ఉన్నారు. ఎప్పుడో ఏళ్ల క్రితం విద్యాశాఖ రూపొందించిన నిబంధనలు సవరించకపోవడంతో జిల్లాలో పదో తరగతి చదువుతున్న 3,403 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు పరీక్ష ఫీజు మాఫీ పొందలేకపోతున్నారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా విద్యాశాఖ తమ నిబంధనలు సవరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. జిల్లాలో 192 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండగా 38 ప్రైవేట్ పాఠశాలలు కలిపి మొత్తం 230 ఉన్నాయి. ఇందులో బాలికలు 5,495, బాలురు 5,269 కలిపి మొత్తం 10,764 మంది ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అన్యాయం

ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయాల్లో గ్రామీణ ప్రాంత ప్రజలకు వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంత ప్రజలకు రూ. 2 లక్షల చొప్పున ధ్రువీకరణ పత్రం అందజేస్తున్నారు. ఇంతకు తగ్గించి ధ్రువీకరణ పత్రం ఇవ్వకూడదనే నిబంధనలు ఉన్నట్లు సమాచారం. విద్యాశాఖలో మాత్రం ఇంకా రూ. 20 వేలు, రూ. 24 వేలు నిబంధన అమలులో ఉండడంతో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రభుత్వం ప్రకటించే ఫీజు మాఫీ అందకుండా పోతుంది. అలాగే ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయం, మీసేవ కేంద్రాలకు వెళితే సర్టిఫికెట్లకు రూ.150 వరకు ఖర్చు అవుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులు ఇబ్బందులు పడకుండా పరీక్ష ఫీజు రూ.125 చెల్లించాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నట్లు సమాచారం.

ఫీజు చెల్లింపునకు నేడే ఆఖరు..

ఈ విద్యా సంవత్సరం (2024- 25) పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ఫీజు చెల్లించే షెడ్యూల్‌ను రాష్ట్ర విద్యాశాఖ ఇప్పటికే విడుదల చేసింది. ఎలాంటి ఫైన్ లేకుండా ఈనెల 28వ తేదీ వరకు చెల్లించవచ్చునని తెలిపారు. రూ. 50 జరిమానతో డిసెంబర్ 2వ తేదీ వరకు, రూ. 200 ఫైన్‌తో డిసెంబర్ 12 వరకు, రూ.500తో డిసెంబర్ 30వ తేదీ వరకు చెల్లించే అవకాశం కల్పించింది. దీంతో విద్యార్థులంతా ఫీజు చెల్లించే పనిలో ఉన్నారు.

నిబంధనలు సవరించాలి



విద్యాశాఖ ఎన్నో ఏళ్ల క్రితం తయారు చేసిన నిబంధనలనే పాటించడంతో 3,403 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రభుత్వ సాయం అందకుండా పోతుంది. ప్రస్తుత కాలానుగుణంగా విద్యాశాఖ నిబంధనలు సవరించి పదో తరగతి పరీక్ష ఫీజు మాఫీ అందించాలి.

– బాల్‌రాజ్, దళిత సంఘాల నాయకుడు, మెదక్



మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్ తదితరులు

హెడ్‌కానిస్టేబుల్ కన్నుమూత

- అనారోగ్యంతో బాధపడుతున్న వీరప్ప
- ఎస్పీ, ఇతర పోలీసు అధికారుల నివాళి



వీరప్ప (ఫైల్)

రేగోడ్(మెదక్)/పాపన్నపేట(మెదక్): పాపన్నపేటలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న రేగోడ్ గ్రామానికి చెందిన నాగప్పగారి వీరప్ప అనారోగ్యంతో కన్నుమూశారు. కొద్దిరోజులుగా ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన బుధవారం తుదిశ్వాస విడిచారు. ఆయన కుటుంబాన్ని మెదక్ ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి, డీఎస్పీ ప్రసన్నకుమార్, ఇంటెలిజెన్స్ అడిషనల్ ఎస్పీ విశ్వప్రసాద్, మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి పరామర్శించారు. పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శాఖ పరమైన నగదును భార్య బుజ్జమ్మకి అందజేశారు. వీరన్నకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. పెద్ద కుమారుడు నరేష్ పోలీస్ బెటాలియన్‌లో విధులు నిర్వర్తిస్తుండగా, చిన్న కుమారుడు ప్రైవేట్ బ్యాంకులో ఉద్యోగిగా ఉన్నాడు. వీరన్నకు జానపద కళలు, నాటకాలంటే అమితమైన ప్రేమ. పలు పాత్రలు పోషించి ప్రేక్షకులను మెప్పించారు. కాగా, వీరప్ప ఆకస్మిక మృతితో పాపన్నపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ట్రాన్స్ జెండర్లకు న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేష్ హితవు



మాట్లాడుతున్న రమేష్

సంగారెడ్డి టౌన్: ట్రాన్స్ జెండర్లు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేష్ అన్నారు. బుధవారం సంగారెడ్డిలో ట్రాన్స్ జెండర్లకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి, ఆరోగ్య సంరక్షణ పొందే సౌకర్యాలు వంటి వాటి గురించి తెలియజేశారు. న్యాయ సహాయం కొరకు జిల్లా కార్యాలయాన్ని సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో పోలీస్ శాఖ అధికారులు, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, వాలంటరీలు తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్ చేసి.. ఊపిరి పోసి..

- యువకుడిని కాపాడిన కానిస్టేబుల్
- ప్రస్తుతం నిలకడగానే ఆరోగ్యం
- సీపీ, ఏసీపీ అభినందనలు



కానిస్టేబుల్ లింగం

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఆత్మహత్యాయత్నానికి పాల్పడి అపస్మారక స్థితిలో ఉన్న యువకుడికి ఓ కానిస్టేబుల్ సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడాడు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగానే ఉంది. సమయస్ఫూర్తితో వ్యవహరించి ఒకరి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్‌ను పోలీసు కమిషనర్, ఏసీపీ సహా పలువురు అభినందించారు. ఈ సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్‌కు చెందిన వంటేరు సందీప్‌రెడ్డి(32) రెండేళ్లుగా ఫ్యామిలీ రెస్టారెంట్ నడుపుతున్నాడు. అయితే.. అంతగా నడవకపోవడంతో కొన్ని నెలల క్రితం రెస్టారెంట్‌ను మూసేశాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా తండ్రి సత్యనారాయణరెడ్డితో ఘర్షణకు దిగాడు. ఈ క్రమంలో తాను చనిపోతున్నానని చెప్పిన సందీప్‌రెడ్డి ఇంట్లో ఉరేసుకున్నాడు. విషయం తెలుసుకున్న తండ్రి వెంటనే ఊర్లనే ఉంటున్న కూతురుకు సమాచారం అందించాడు. హతాశులైన ఆమె ఏడ్చుకుంటూ తమ్ముడి ఇంటి వైపు వెళుతోంది. ఆ సమయంలో జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్ ఎదుట బ్లూ కోట్ కానిస్టేబుల్ లింగం వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఎక్కడకు వెళుతున్నారు.. ఎందుకు ఏడ్చుతున్నారని ఆరా తీశాడు. విషయం తెలుసుకున్న కానిస్టేబుల్.. వెంటనే వారితో కలసి సందీప్‌రెడ్డి ఇంటికి వెళ్లాడు. గది తలుపులు పగులగొట్టి వేలాడుతున్న అతడిని కిందకు దించాడు. అపస్మారకస్థితిలో ఉన్న అతడిని కానిస్టేబుల్ సీపీఆర్ చేశాడు. స్పృహ రాగానే, స్థానిక వైద్యుడి సహకారంతో వెంటనే గజ్వేల్ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగానే ఉందని ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. సీపీఆర్ చేసి యువకుడి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్ లింగంను సీపీ అనురాధ, ఏసీపీ పురుషోత్తం అభినందించారు. అలాగే సందీప్‌రెడ్డి కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కష్టించి కొలువు కొట్టారు

తొలి ప్రయత్నంలోనే యూనిఫామ్ ఉద్యోగం

సంగారెడ్డి క్రైమ్: 'పట్టుదలతో చేస్తే సమరం తప్పకుండా నీదే విజయం పదరా సోదరా'అనే పాట ఈ యువకుల్లో స్ఫూర్తి మంత్రం నింపిందేమో తెలియదు కానీ లక్ష్యసాధనలో మాత్రం ఎన్ని అవరోధాలు ఎదురైనా పట్టు సడలించకుండా గురిచూసి లక్ష్యాన్ని ఛేదించారు. బలమైన సంకల్పం ముందు విధికూడా తలవంచుతుందని నిరూపించారు. పోలీసు కొలువు సాధించాలన్న కలని సాకారం చేసుకునేందుకు ప్రణాళికతో కష్టించి ఆ కొలువు యూనిఫామ్‌ను ఒంటిపైకి రప్పించుకున్నారు. ప్రజలకు సేవ చేయాలనుకుని పోలీసు వృత్తిని ఎంచుకుని ఆ ఉద్యోగాన్ని సాధించాలన్న స్వప్నానికి రెక్కలు తొడిగి తమ కలని నిజం చేసుకున్నారు. ఇలా కానిస్టేబుల్ కొలువు సాధించిన వారిలో ఒక్కొక్కరిదీ ఒక్కో కుటుంబ నేపథ్యం. ఒకరిది నిరుపేద కుటుంబం కాగా మరొకరిది వ్యవసాయ కుటుంబం. లక్షల మంది రాసిన పోటీ పరీక్షలో నిలిచి గెలిచారు. సంగారెడ్డి పట్టణానికి చెందిన దాదాపు 20 నుంచి 25 మంది యువతీ యువకులు పోలీస్ నియామక పరీక్షల్లో కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారు. ఈనెల 30 నుంచి శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుల్ సంగారెడ్డి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్‌లో విధులో చేరనున్నారు. తాము ఎలా సన్నద్ధమైందీ, ఏ విధంగా ఉద్యోగాన్ని సాధించారనే అంశాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

ఎస్సై కావాలనుకుని...



నా పేరు నవీన్ యాదవ్. మాది సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి పట్టణంలోని కల్వకుంట. మాది వ్యవసాయ కుటుంబం. నేను బీటెక్ చదువుతుండగా, ఎస్సై, కానిస్టేబుల్ నోటిఫికేషన్ రావడంతో ప్రయత్నించాను. తొలి ప్రయత్నంలోనే సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాను. ప్రతిరోజూ ఉదయం ఐదు గంటల నుంచి ఎనిమిది గంటలు వరకు, సాయంత్రం ఐదు గంటల నుంచి ఏడు గంటల వరకు గ్రౌండ్‌లో శారీరకంగా వ్యాయామం చేసేవాడిని. మిగతా సమయంలో ప్రణాళికతో మోడల్ పేపర్లు ప్రాక్టీస్ చేశాను. లక్ష్యాన్ని నిర్దేశించుకుని శ్రమిస్తే విజయం సాధించడం కష్టమేమీ కాదు. మా కుటుంబంలో నేనే తొలి ప్రభుత్వ ఉద్యోగి కావడం ఆనందంగా ఉంది. మొదటి పోస్టింగ్ అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చారు.

గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమవుతుండగా...



నా పేరు షేక్ ఇర్ఫాన్. సంగారెడ్డి పట్టణంలోని శాంతినగర్. అమ్మ నాన్నలు ఎంతో శ్రమించి మమ్మల్ని చదివించారు. నేను డిగ్రీ చదివాక, గ్రూప్స్ సిద్ధమవుతుండగా నోటిఫికేషన్ విడుదలైంది. దీంతో నేను ప్రయత్నించాను. తొలి ప్రయత్నంలోనే సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగాన్ని సాధించా. ఎలాంటి కోచింగ్ తీసుకోకుండానే చదువుకున్నాను. అర్థమేటిక్, రీజనింగ్ టెస్ట్ మోడల్ పేపర్లు రోజుకు నాలుగు గంటలు ప్రాక్టీస్ చేసేవాడిని. ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం ఐదు నుంచి ఆరు గంటలపాటు గ్రౌండ్‌లో శారీరకంగా వ్యాయామం చేసేవాడిని. నా మొదటి పోస్టింగ్ నారాయణఖేడ్ మండలం కంగ్టి పోలీస్ స్టేషన్‌లో ఇచ్చారు.

వంతెనను ఢీకొన్న కారు.. ఇద్దరు మృతి



రాజశేఖర్(ఫైల్)



శివరాజ్(ఫైల్)

అల్లాదుర్గం(మెదక్): వంతెనను ఢీకొని ఇద్దరు మృతి చెందారు. ఈ సంఘటన సంగారెడ్డి–నాందెడ్ అకోలా రహదారి161 హైవేపై అల్లాదుర్గంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ బోధన్‌కు చెందిన దేశముఖ రాజశేఖర్ తన తండ్రి శివరాజ్, తల్లి లక్ష్మిబాయి, భార్య అరుణ వారి కూతురు అనన్యలు కలిసి హైదరాబాద్ నుంచి బోధన్‌కు వస్తున్నారు. మార్గమధ్యలో అల్లాదుర్గం హైవేపై అతివేగంతో ఉన్న వారి కారు అదుపు తప్పి వంతెనను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన వారిని జోగిపేట, సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాజశేఖర్ మరణించగా, అలాగే.. సంగారెడ్డిలో శివరాజ్ తుదిశ్వాస విడిచారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు

రామాయంపేట(మెదక్): రామాయంపేట శివారులోని కామారెడ్డి బైపాస్ రోడ్డు మలుపు వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. రామాయంపేట వైపు నుంచి కామారెడ్డి వైపు అతివేగంగా వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న ప్యాసింజర్ ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న బీహార్‌కు చెందిన బహదూర్, దీపక్, అక్కులు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్సై బాలరాజ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆయిల్ పామ్‌తో అధిక ఆదాయం



వడ్డేపల్లిలో పంటలను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ

జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ

దుబ్బాకటౌన్: ఆయిల్ పామ్ సాగుతో అధిక ఆదాయం పొందవచ్చని, దేశవ్యాప్తంగా ఈ పంటకు భారీ డిమాండ్ ఉందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ అన్నారు. బుధవారం రాయపోల్ మండలం అంకిరెడ్డిపల్లి గ్రామంలో ఆయిల్ ఫామ్ పంటలను, వడ్డేపల్లి గ్రామంలో డ్రాగన్ ఫ్రూట్ పంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్‌లో నీటి యాజమాన్యాన్ని సరైన పద్ధతిలో పాటించడం వలన అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. పామాయిల్ చెట్లు నాటిన 14 నెలలకు పూత ప్రారంభమవుతుందని సూచించారు. మొక్క 30 నెలలు వయస్సు వచ్చేవరకు లేత దశలో మగ, ఆడ పుష్పాలను తప్పనిసరిగా తొలగించాలన్నారు. 36 నెలల వయస్సులో గెలల బరువు బాగా వస్తుందన్నారు. ఎకరానికి నికరంగా ప్రతి సంవత్సరం 10 టన్నుల పామాయిల్ దిగుబడిని పొందవచ్చన్నారు. ఆయిల్ ఫామ్ తోటలో మూడేళ్ల వరకు అంతర పంటలుగా మొక్కజొన్న, వేరుశనగ, ధనియాల వంటివి సాగు చేసి అధిక దిగుబడి పొందవచ్చన్నారు. జిల్లాలో దాదాపు 11 వేల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ పంటను రైతులు సాగు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి రమేశ్, ఏఈఓ మధులిక, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

నర్సాపూర్: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సాఫ్ట్‌బాల్ పోటీలకు తమ పాఠశాలకు విద్యార్థులు ఎంపికయ్యారని అల్లూరి సీతారామరాజు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల జిల్లాలోని మాసాయిపేటలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎనిమిది మంది ఎంపికయ్యారని చెప్పారు. డిసెంబర్‌లో నిర్మల్‌లో రాష్ట్రస్థాయి పోటీలు జరుగనున్నాయని వివరించారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

- పరారీలో మరో ఇద్దరు..
- 10కిలోల గంజాయి, సెల్‌ఫోన్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ పురుషోత్తంరెడ్డి



స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి

గజ్వేల్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి 10కిలోల గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి వివరాలు వెల్లడించారు. వివరాలిలా ఉన్నాయి. సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు గంజాయి విక్రయాలపై నిఘాపెట్టారు. ఈ క్రమంలో గజ్వేల్ మండలం అహ్మదీపూర్‌కు చెందిన అరికెల శేఖర్, అదేగ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బోయిని నరేష్, కొండపాక మండలం సిరిసినగండ్లకు చెందిన సుక్కసారి భానుప్రసాద్‌లు చెడు వ్యసనాలకు బానిసలుగా మారి, గంజాయి విక్రయంతో పరిసర ప్రాంతాల్లో బైకులు దొంగతనం చేశారు. అదే బైకులపై భద్రాచలం జిల్లా సీలేరుకు వెళ్లి రెండు, మూడుసార్లు గంజాయి తీసుకొచ్చి గజ్వేల్, అహ్మదీపూర్ గ్రామ పరిసరాల్లో విక్రయించారు. వీరిని ఎనిమిది నెలల క్రితం సిద్దిపేట త్రీటౌన్ పోలీసులు పట్టుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. జైలు నుంచి విడుదలైన తర్వాత మళ్లీ గంజాయి విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో శేఖర్, బోయిని నరేష్‌లు సీలేరుకు వెళ్లి అక్కడ వర్ధన్ అనే వ్యక్తి వద్ద రూ.30,800 చెల్లించి 20కిలోల గంజాయి కొనుగోలు చేశారు. ఇందులో 10కిలోల గంజాయిని అరికెల శేఖర్ బస్సులో తీసుకొస్తుండగా పోలీసులు స్వాధీనంచేసుకున్నారు. ఈ కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతున్నదని తెలిపారు.



రామచంద్రాపురం పట్టణంలోని జాతీయరహదారిపై ఏర్పాటు చేసిన స్వెటర్ దుకాణాలకు మంచి డిమాండ్ పెరిగింది. వారం రోజులుగా చలి మరింత పెరగడంతో స్వెటర్ల అమ్మకాలు జోరందుకున్నాయి. 25 ఏళ్లుగా రాజస్తాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్‌లకు చెందిన రైతులు ప్రతి చలికాలంలో ఈ ప్రాంతానికి వచ్చి ఆరు నెలల పాటు ఈ వ్యాపారం నిర్వహించి తిరిగి సొంతూరు వెళ్లిపోతారు. స్వెటర్‌ల నాణ్యతను బట్టి రూ.250 నుంచి రూ.1500 వరకు విక్రయిస్తున్నారు. గత ఏడాది కన్నా ఈ ఏడాది చలి ఎక్కువగా ఉండటంతో వ్యాపారం మంచి నడుస్తుందని వ్యాపారస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– రామచంద్రాపురం(పటాన్‌చెరు)